
సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 20 । జూలై । 2023



నూకలమర్రికి తూటాలగాయం

నూకలమర్రి ఎన్‌కౌంటర్‌కు నేటితో 23 ఏళ్లు నిండాయి. ఈ ఎన్‌కౌంటర్ జనశక్తిని కోలుకోలేని దెబ్బతీసింది.

– పూర్తి వివరాలు లోపలి పేజీల్లో..



మూలవాగుకు జలకళ

కోనరావుపేట(వేములవాడ):నిమ్మపల్లి మూలవాగుకు జలకళ సంతరించుకుంది. 19 అడుగుల సామర్థ్యంలో గల ప్రాజెక్టులో ఆరు అడుగుల నీటి మట్టం చేరింది.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

వానొచ్చే.. వరదొచ్చే!

- వరుసవానలతో ప్రాజెక్టులకు మొదలైన వరద
- వరినాట్లు మొదలుపెట్టిన రైతన్నలు
- ఎగువ ప్రవాహాలతో మిడ్‌మానేరు దిగువకు నీరు
- మానేరుకు వాగుల నుంచి మొదలుకాని వరద
- ఎల్లంపల్లిలో పెరుగుతున్న వరద ఉధృతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పొలంపనులు మొదలుపెట్టారు. బుధవారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో అత్యధికంగా 3.2 సెం.మీ వర్షపాతం, పెద్దపల్లిలో కాల్వ శ్రీరాంపూర్‌లో 2.9 సెం.మీ, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం 2.8 సెం.మీ, కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో 2.9 సెం.మీల వర్షపాతం నమోదైంది.



మిడ్‌మానేరు జలాశయం

ప్రాజెక్టు:	సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
మిడ్‌మానేరు:	27.50 టీఎంసీ	15.67 టీఎంసీ	8,500 క్యూసెక్కులు	9320 క్యూసెక్కులు
లోయర్‌మానేరు:	24.03 టీఎంసీ	09.5 టీఎంసీ	9,210 క్యూసెక్కులు	210 క్యూసెక్కులు
ఎల్లంపల్లి:	20.17 టీఎంసీ	15.17టీఎంసీ	5,712 క్యూసెక్కులు	12,721 క్యూసెక్కులు

పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి కొన్నిరోజులు, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మొదలైన వరద ప్రవాహాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఈనెల 15 వరకు ఎలాంటి వానలు లేకపోవడంతో ఇక ప్రాజెక్టులను కాళేశ్వరం నీటితో నింపేందుకు పంపింగ్ ప్రారంభించారు. రామడుగు లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా కాళేశ్వరం జలాలతో మిడ్‌మానేరును నింపుతున్నారు. అక్కడి నుంచి దిగువకు వదుతారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సైతం ఈనెల 17న మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేసిన 5 టీఎంసీల నీటిని దిగువన ఉన్న లోయర్‌మానేరు డ్యాంకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంతలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో రైతులు నాట్లు వేయడంలో తలమునకలయ్యారు. మానేరుపై నిర్మించిన ప్రాజెక్టులకు మానేరు నది, మోయతుమ్మెద వాగు, ఎస్సారెస్పీ, మూలవాగుల నుంచి వచ్చే ప్రవాహాలే మూలాధారం. వాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వరద లేకపోవడంతో ప్రాజెక్టులలోకి తక్కువ నీరు చేరుతోంది.

మిడ్‌మానేరు నుంచి దిగువకు..

మానేరుపై బోయిన్‌పల్లి వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఈనెల 12న ప్రాజెక్టులో 15.61 టీఎంసీల నీరు ఉండగా.. ప్రస్తుతం అదే స్థితి కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరదకు తోడు, ప్రాజెక్టులోకి లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఆరుగేట్ల ద్వారా 9,320 క్యూసెక్కుల నీరు లోయర్‌మానేరు డ్యాం (ఎల్‌ఎండీ) ప్రాజెక్టులోకి దిగువకు వదలుతున్నారు. ప్రాజెక్టు నుంచి వెళ్లే నీటితో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీరందనుంది.

- దిగువనే ఉన్న లోయర్ మానేరులోకి మిడ్‌మానేరు మినహా పెద్దగా ఇన్‌ఫ్లో లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతవారం వరకు కేవలం 8 టీఎంసీల నీరే ఉంది. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి వచ్చే నీటి ద్వారా 9.5 టీఎంసీలకు చేరింది. లోయర్‌మానేరు డ్యాంకు ప్రధాన ఆధారమైదన మోయతుమ్మెద వాగు నుంచి ఆశించిన స్థాయిలో వరద రాకపోవడంతో లోయర్‌మానేరు నెమ్మదిగా నిండుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 9.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.

వారం రోజుల క్రితం ప్రాజెక్టుల నీటినిలువ	
మిడ్‌మానేరు	:15.61 టీఎంసీలు
లోయర్‌మానేరు	:8.44 టీఎంసీలు
ఎల్లంపల్లి	:13.78 టీఎంసీలు

- పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లికి వరద పోటెత్తుతోంది. గోదావరినదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 20.175 టీఎంసీలు. వర్షాలు జాప్యం కావడంతో గతవారం ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలు, కడెం, ఎస్సారెస్పీ నుంచి దిగువకు వస్తున్న నీరు భారీగా ఉంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం 15.17 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 5,712 క్యూసెక్కులుగా ఉండగా, ఔట్‌ఫ్లో 12,721 క్యూసెక్కులుగా ఉంది. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 2.20 లక్షల ఎకరాలకు నీరందిస్తారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

గంభీరావుపేటలో 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా బోయినిపల్లిలో 12.0, రుద్రంగిలో 14.9, చందుర్తిలో 16.8, వేములవాడ రూరల్‌లో 12.6, వేములవాడలో 32.6, సిరిసిల్లలో 19.0, కోనరావుపేటలో 20.1, వీర్లపల్లిలో 28.1, ఎల్లారెడ్డిపేటలో 31.5, ముస్తాబాద్‌లో 25.3, తంగళ్లపల్లిలో 31.5, ఇల్లంతకుంటలో 16.7 మి.మీ.వర్షం కురిసింది.

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల: జిల్లాలో భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని మండలాల అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పురాతన, శిథిల భవనాలు, కూలే గోడలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మానేరు, మూలవాగు, నక్కవాగు, ఇతర వాగుల్లోకి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. అధికారులు హెడ్‌క్వార్టర్లలో ఉండాలని సూచించారు. కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎస్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పవన్‌కుమార్, డీపీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/రుద్రంగి: జిల్లాను వర్షం ముసురుకుంది. ఈ ఏడాది ఈ సీజన్‌లో సరైన వర్షాలు లేక రైతులు బిక్కుబిక్కుమంటుండగా.. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో వానాకాలం సాగుపై రైతుల్లో ఆశలు కల్గించాయి.

- కామారెడ్డి జిల్లాలో వర్షాలు పడడంతో పాల్వంచవాగు పారుతూ నర్మాల ఎగువ మానేరులోకి వరద చేరుతోంది. సిద్దిపేట జిల్లాలోనూ వర్షాలు పడడంతో కూడవెల్లి వాగులో వరద మొదలైంది.
- నిజామాబాద్ జిల్లా అటవీ ప్రాంతాలో వర్షాలు పడడంతో కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయంలోకి ఆరు అడుగుల నీరు చేరింది.
- ఇల్లంతకుంట మండలం పొత్తూరు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. సిరిసిల్ల, వేములవాడల్లో జనజీవనం స్తంభించింది. రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి తగ్గింది.
- ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి లేత మామిండ్లవాగు, పాలేటివాగు, పెద్దమ్మఒర్రె, చిట్టివాగులు పారుతున్నాయి.
- ముస్తాబాద్ మండలంలో మానేరువాగు ప్రవహిస్తోంది. పోతుగల్‌లో గంగమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, చెక్‌డ్యామ్‌పై నుంచి వరద నీరు పారుతోంది.
- రుద్రంగిలోని వేములవాడ–కోరుట్ల ప్రధాన రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి.



పొత్తూరు వద్ద రోడ్డుపై విరిగిన చెట్టు



ముస్తాబాద్‌లో చెక్‌డ్యామ్‌పై వరదనీరు



గుంతలమయమైన శాంతినగర్ బైపాస్‌రోడ్డు

న్యూస్‌రీల్

ఐదో విడత ఇంటింటా ఇన్నోవేటర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిరిసిల్లకల్చరల్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని ఐదోసారి నిర్వహించనున్నారు. వైవిధ్యమైన ఆవిష్కరణలను ఆగస్టు 5వ తేదీలోపు పంపించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు తమ సృజనాత్మకతను చాటుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆగస్టు 5లోపు ఆవిష్కరణలను పంపించాలని సూచించారు. ఎంపికైన ఐదు ఆవిష్కరణలను స్వాతంత్ర్య సంబరాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఆవిష్కరణ వివరాలను 91006 78543లో పంపించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఉపేందర్‌రావు, డీపీఆర్వో మామిండ్ల దశరథం ఈడీఎం శ్రీనివాస్, ఎల్‌డీఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.

సెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సెస్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సిరిసిల్ల: జిల్లా పరిధిలో సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతికి బుధవారం ఉద్యోగ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. పీఆర్సీ–2022ను అమలు చేయాలని, సిబ్బందికి టూల్ కిట్లు, రెయిన్‌కోట్లు అందించాలని, అర్హత గల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఈమేరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) ప్రధాన కార్యదర్శి కె.దేవయ్య సెస్ చైర్మన్, వైస్‌చైర్మన్, ఎండీలకు వినతిపత్రం అందించారు. ఎంప్లాయీస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మిస్సయిన సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఎస్సై రమాకాంత్

కోనరావుపేట(వేములవాడ): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కోనరావుపేట పోలీసులు బుధవారం అప్పగించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన కర్నాల హరీశ్ ఈనెల 12న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై రమాకాంత్ సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బుధవారం హరీశ్‌కు అందించారు. ఇప్పటి వరకు మండలంలో ఏడుగురికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అందజేసినట్లు తెలిపారు.

మానేరు కాల్వలు శుభ్రం షురూ..

సాక్షి ఎఫెక్టు



కుంటను భారీ క్రేన్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మానేరు ప్రాజెక్టు కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్త, తుంగను నీటిపారుదలశాఖ అధికారులు తొలగించే చర్యలను ప్రారంభించారు. ఈనెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన 'వెనక్కిపట్టిన వానలు.. నీరందేనా..?' కథనంపై అధికారులు స్పందించారు. నీటిపారుదలశాఖ డీఈఈ రవికుమార్, ఏఈ వంశీకృష్ణ, సిబ్బంది మానేరు కెనాల్స్‌పై బుధవారం భారీ క్రేన్‌ను ఏర్పాటు చేశారు. రత్నాలకుంటలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. తెర్లుమద్ది వైపు మానేరు నీరు వెళ్లేలా పనులు చేపట్టారు. కెనాల్స్‌లో మురుగు, చెత్త, గుర్రపుడెక్క భారీగా ఉండడంతో కనీసం కూలీలు, ఇతర యంత్రాలు దిగే పరిస్థితి లేదని డీఈఈ పేర్కొన్నారు. భారీ క్రేన్ సహాయంతో కెనాల్‌ను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు కూడా సహకరించి కాలువలు బాగుండేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, రైతులు ఉన్నారు.

పేదలు లేని 'పెద్ద'పల్లి

- తరువాతి స్థానంలో కరీంనగర్
- జాతీయ బహుముఖ పేదరిక సూచిలో వెనకబడ్డ జగిత్యాల

సాక్షిప్రతినిధి,కరీంనగర్: పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజాగా 'జాతీయ బహుముఖ పేదరిక సూచి (ఎంపీఐ)– ఒక ప్రగతి సమీక్ష' పేరిట నీతి ఆయోగ్ విడుదలచేసిన నివేదిక గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈసర్వేలో పలుఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా దేశంలో పేదరికం తగ్గి, ఆర్థిక అంతరాలు క్రమంగా సమసిపోతున్నాయని నివేదిక పునరుద్ఘాటించింది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్)–4తో ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్–5తో పోల్చి ఈ సర్వే వివరాలను నీతి ఆయోగ్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోనూ పేదరికం తగ్గింది. జగిత్యాలలో 4.77 శాతం, రాజన్న సిరిసిల్లలో 3.68 శాతం, కరీంనగర్‌లో 2.50 శాతం, పెద్దపల్లిలో 2.17 శాతంగా నమోదైంది. ఇందులో పెద్దపల్లి అతితక్కువ 2.17 శాతం పేదరికంతో రాష్ట్రంలో అత్యంత తక్కువ సంఖ్యలో పేదలు ఉన్న జిల్లాగా రికార్డు సృష్టించింది. జిల్లాలో అధికశాతం పారిశ్రామిక ప్రాంతం కావడం, రోడ్డు రవాణా, రైల్వే కనెక్టివిటీ, విద్యా, వైద్యం తదితర సదుపాయాల దృష్ట్యా మొదటి నుంచి పెద్దపల్లి జిల్లా ముందువరుసలో నిలిచింది. తాజాగా నీతిఆయోగ్ విడుదలచేసిన నివేదికలోనూ ఇదే విషయం పునరావృతం కావడం గమనార్హం.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కేవైసీఎస్ గల్ఫ్ శాఖ సభ్యులు

రుద్రంగి(వేములవాడ): ఇటీవల మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కూర్మ మల్లేశం కుటుంబానికి గల్ఫ్‌లో ఉంటున్న కేవైసీఎస్ గల్ఫ్‌శాఖ సభ్యులు రూ.15వేల ఆర్థిక సాయం చేశారు. రుద్రంగిలోని మల్లేశం కుటుంబ సభ్యులను బుధవారం కలిశారు. నిరుపేద మల్లేశం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. నగదు అందజేసిన వారిలో కురుమ నాయకులు మహేందర్, చిట్కూరి శ్రీనివాస్, స్థానికులు మెగుళ్ల శ్రీహరి, ఈర్లం రాజిరెడ్డి ఉన్నారు.

వేములవాడకు వీటీడీఏ ఆఫీస్

వేములవాడ: వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) కార్యాలయాన్ని వేములవాడకు మార్చాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జిల్లా కలెక్టర్‌ను కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్వరలోనే వేములవాడలో వీటీడీఏ కార్యాలయం ప్రారంభంకానుంది.

దళిత యువకులను కొట్టిన ఎస్సైని సస్పెండ్ చేయాలి

- దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాకేశ్



బాధిత యువకులతో కలిసి మాట్లాడుతున్న రాకేశ్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరుకు చెందిన దళిత యువకులను బట్టలూడదీసి కొట్టిన ఎస్సై రాజేశ్‌ను సస్పెండ్ చేయాలని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాకేశ్ కోరారు. బాధిత యువకులతో ఇల్లంతకుంటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దళిత, నిరుపేద యువకులైన ర్యాగటి అజయ్, తోడేటి అరవింద్ ఈఎంఐ ద్వారా ట్రాక్టర్లు కొని, గ్రామంలోని మరికొందరితో కలిసి ఇసుక రవాణా చేస్తూ జీవిస్తున్నారన్నారు. గత నెల 29న పొత్తూరుకు వచ్చిన ఎస్సైతోపాటు డ్రైవర్ సదరు యువకుల వద్ద రూ.25వేలు, ఫోన్‌లు తీసుకున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకున్న విషయం అందరితో చెబుతూ బదనాం చేస్తున్నారని ఎస్సై రాజేశ్ ఈనెల 2న సదరు యువకులను పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చి బూతులు తిడుతూ చితకబాదారని ఆరోపించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించారన్నారు. ఎస్పీ స్పందించి ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ర్యాగటి అజయ్, తోడేటి అరవింద్, దయ్యాల పర్శరాములు, కొంపెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే..



ఇల్లంతకుంట మండలం పొత్తూరులోని వాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో కానిస్టేబుళ్లు వెళ్లి ట్రాక్టర్ల వివరాలు అడుగుతుండగా సదరు యువకులు దురుసుగా ప్రవర్తించారు. అంతేకాకుండా ట్రాక్టర్లతో తప్పించుకుని వెళ్లగా అదేరోజు కేసులు నమోదు చేశాం. కేసుల నుంచి తప్పించుకునేందుకే కావాలని ఇలా చేస్తున్నారు.

– రాజేశ్, ఎస్సై, ఇల్లంతకుంట

ఎగువమానేరు @ 18 ఫీట్లు



గంభీరావుపేట (సిరిసిల్ల): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరులో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 30 ఫీట్లు కాగా ప్రస్తుతం 18 ఫీట్ల నీరుంది. కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగు ద్వారా వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టుకు జీవనాధారమైన సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగు వరదనీరు ఇంకా ప్రాజెక్టులోకి చేరలేదు.

ఉపాధిహామీలో పండ్లతోటల పెంపకం

- జిల్లాలో 1,040 ఎకరాలు లక్ష్యం
- డ్రిప్పు ఇరిగేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీ
- ఇతరులకు 90 శాతం
- జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

సిరిసిల్ల: జిల్లాలో ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, ఉపాధిహామీ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో 1,040 ఎకరాల్లో రైతులు పండ్లతోటలు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఐదెకరాలలోపు భూమి ఉండి, నీటివసతి ఉన్న రైతులను పండ్లతోటల వైపు మళ్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్పు ఇరిగేషన్‌లో వందశాతం, ఇతరులకు 90 శాతం రాయితీ అందిస్తామని గౌతమ్‌రెడ్డి వివరించారు. ఉపాధిహామీలో జాబ్‌కార్డు ఉన్న రైతులను ఎంపిక చేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పండ్ల తోటలను వేయాలో రైతులకు అవగాహన కల్పించా లన్నారు. మామిడి, జామ, నిమ్మ, బత్తాయి, సీతాఫలం, సపోట, జీడిపప్పు, మునగ, డ్రాగన్‌ఫ్రూ ట్, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరి వంటి పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చని వివరించారు. 13 రకాల పండ్లతోటలను పెంచుకోవచ్చని, జూలై 31లోగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా అంచనాలు రూపొందించాలని, ఆగస్టు 31వ తేదీలోగా మొక్కలు నాటేందుకు గుంతలు తీయాలని జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి కోరారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఉద్యానవనాల అధికారి జ్యోతి, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అతిథులపై పిడుగుపాటు

- ఆటో రెన్యూవల్‌కు నో చెప్పిన సర్కార్
- కొత్తగా దరఖాస్తులకు ఆహ్వానం
- పాతవారికి ఇప్పటికీ అందని మూడు నెలల వేతనాలు
- కొనసాగిస్తారని ఆశలో గెస్టు లెక్చరర్లు
- తమనే పునరుద్ధరించాలని విన్నపం

సిరిసిల్లకల్చరల్: గత పదేళ్లుగా అతిథి అధ్యాపకులు(గెస్ట్ లెక్చరర్లు)గా పనిచేస్తున్న వారిని ప్రభుత్వ నిర్ణయం ఆందోళనకు గురిచేస్తుంది. ఇన్నాళ్లు ఏటా విద్యాసంవత్సరంలో రెన్యూవల్ చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మాత్రం కొత్తగా నియమించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈసారి కూడా తమనే రెన్యూవల్ చేస్తుందన్న ఆశతో ఉన్న గెస్ట్ లెక్చరర్లు ప్రభుత్వ నిర్ణయంతో కుదేలయ్యారు.



డీఐఈవోకు వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ లెక్చరర్లు

రెన్యూవల్ కోసం ఎదురుచూస్తుండగానే...

కొన్నేళ్లుగా బోధన విధులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్లకు మాత్రం ఇప్పటి వరకు పునర్‌నియామకాలు జరగలేదు. తాజాగా గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఇంటర్‌బోర్డు కమిషనర్ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, కళాశాల ప్రిన్సిపాల్‌తో కూడిన త్రిసభ్య బృందం కొత్త గెస్టు లెక్చరర్లను ఎంపిక చేయనున్నారు. పీరియడ్‌కు రూ.390 చొప్పున నెలకు గరిష్టంగా 72 పీరియడ్ల వరకు అనుమతిస్తారు. మొత్తంగా నెలకు రూ.28,080 వేతనం వచ్చేలా స్థిరీకరించారు. ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకుంటే, 28న అర్హుల పేర్లతో కూడిన జాబితా విడుదల చేస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా విన్నపాలు

పదేళ్లుగా సేవలందిస్తున్న తమను కాదని కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయడాన్ని అతిథి అధ్యాపకులు ఖండిస్తున్నారు. పాతవారిని పునరుద్ధరించకుండా ఖాళీలను కొత్త వారితో భర్తీ చేస్తామనడం సరికాదని పేర్కొంటున్నారు. గతేడాదికి సంబంధించిన మూడు నెలల వేతనాలు ఇంకా ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. బకాయిపడ్డ తమ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈమేరకు డీఐఈవో కార్యాలయంలో జిల్లాలోని అతిథి అధ్యాపకులు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షురాలు కొమురవెల్లి దీపిక, అల్లె ప్రభాకర్, మానువాడ శ్రీనివాస్, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా	కాలేజీలు	లెక్చరర్లు
రాజన్నసిరిసిల్ల	10	21
కరీంనగర్	11	46
పెద్దపల్లి	14	47
జగిత్యాల	15	50

అడుగుకో గుంత

- రోడ్డు బాగయ్యేదెన్నడో ?
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- ధ్వంసమవుతున్న వాహనాలు
- తారులేచిపోయి గుంతలమయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- రుద్రంగిలో పరిస్థితి


బురదమయమైన రుద్రంగిలోని ప్రధాన రోడ్డు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలో అడుగుకో గుంత... అనే పరిస్థితులు తయారయ్యాయి. మండల కేంద్రంలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి దుస్థితి దారుణంగా ఉంది. మోకాలులోతు గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏళ్లుగా రోడ్డు శిథిలమైనా పట్టించుకునే వారు లేక ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ప్రమాదాల బారిన ప్రయాణికులు

రుద్రంగి మండల కేంద్రంలో ధ్వంసమైన కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారిపై ప్రయాణం నరకంగా మారింది. ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మోకాలు లోతు గుంతలతో ఉన్న రోడ్డుపై రాత్రి వేళ ఎక్కడ ఏం ఉన్నదో తెలియక ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

రుద్రంగిలోని ధ్వంసమైన రోడ్డును బాగుచేసేందుకు జనవరిలోనే రూ.9 కోట్లు మంజూరయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.


ఈ చిత్రం.. రుద్రంగిలోని అంబేడ్కర్‌చౌరస్తాలోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. తారులేచిపోయి కంకరతేలిన ఈ రోడ్డుపై ఇబ్బందిపడుతూ ప్రయాణిస్తున్నారు. మోకాలు లోతు గుంతలు పడ్డ చోట మట్టితో పూడ్చారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారింది.


చెరువును తలపిస్తున్న ఈ రోడ్డు రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం. రోడ్డుకంటే ఎత్తుగా సైడ్ డ్రెయిన్ నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లే దారి లేక ఇలా నిలిచిపోయి రోడ్డు శిథిలమవుతుంది. గుంతలను మట్టితో పూడ్చడంతో వర్షాలకు చిత్తడిగా మారి అడుగుతీసి అడుగువేయలేని విధంగా రోడ్డు మారింది.

ప్రమాదాలు జరుగుతున్నాయి


రుద్రంగిలో తీవ్రంగా ధ్వంసమైన రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ గుంతలు పడడంతో రాత్రి వేళ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా రోడ్డును బాగు చేయాలి. – పల్లికొండ గంగాధర్, రుద్రంగి.

పట్టించుకుంట లేరు


రుద్రంగిలోని ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై నడిచేందుకు వీలు లేకుండా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకుంట లేరు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేయాలి. – ద్యావల రవి, రుద్రంగి

త్వరలోనే పనులు ప్రారంభం


కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. తాత్కాలిక మరమ్మతులు చేస్తే ప్రయోజనం ఉండదు. ఫోర్‌లేన్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతాం. – సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, రుద్రంగి

క్లుప్తంగా

డిగ్రీ కాలేజీ ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారు?


మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత విద్యార్థులను మోసం చేశారన్నారు. కేటీఆర్ హామీకి ఎనిమిదేళ్లు గడుస్తుందని గుర్తు చేశారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేక ఈ ప్రాంతంలోని పేద, బలహీన, గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీ కోసం ఎన్నో ఉద్యమాలు చేసినా స్థానిక నాయకులు స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు.

పారా అథ్లెట్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్లకల్చరల్: ఖేలో ఇండియా కేంద్రాల్లో అదనంగా ఏర్పాటు చేయనున్న పారా అథ్లెట్ల శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే ఆసక్తి, శిక్షణ పొందుతున్న పారా అథ్లెట్ల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి రాందాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగ చాంపియన్ అథ్లెట్లు, పారా అథ్లెట్‌కోచ్‌లు, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న దివ్యాంగులైన చాంపియన్ల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆసక్తి గల వారు కలెక్టరేట్ రెండో అంతస్తులో 19వ నంబర్ గదిలో ఉన్న జిల్లా క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

‘దేశి’ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: డిప్లామా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(దేశి) ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రకటనలో తెలిపారు. ఎరువుల విక్రయం, క్రిమిసంహారక లైసెన్స్ ఉండి, కనీసం పదోతరగతి విద్యార్హత గల డీలర్లు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. 48 తరగతులను ప్రతీ ఆదివారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా నిర్వహించే ఈ కోర్సులో చేరే డీలర్ల శిక్షణకు కో–ఆర్డినేటర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ డిగ్రీ, లేదా పీజీ పూర్తి చేసి ఐదేళ్లపాటు వ్యవసాయానికి సంబంధించిన రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వేములవాడ: వేములవాడలోని మొదటి బైపాస్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన దాడిలో ఎస్సైలు వెంకట్రాజం, నాగరాజు పాల్గొన్నారు. రూ.86వేల నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లాడ్జి నిర్వాహకుడిని సైతం అదుపులోకి తీసుకున్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- జిల్లా గ్రామ పంచాయతీ సంఘాల జేఏసీ నిరసన
- సిరిసిల్లలో ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి


ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా వెట్టిచాకిరీకి గురవుతున్న కార్మికుల పనికి సరైన వేతనాలు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని కోరారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, మూశం రమేశ్, గుర్రం అశోక్, శ్రీధర్, రాజశేఖర్, శ్రీనివాస్, మల్లయ్య, లక్ష్మణ్, కృష్ణవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ సెంటర్‌లో చోరీకి యత్నం

- పోలీసు జాగిలాలతో తనిఖీలు


గ్రోమోర్ సెంటర్లో జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వేములవాడ: వేములవాడలోని పాపన్నచౌక్‌లో గల గ్రోమోర్ సెంటర్‌లో బుధవారం వేకువజామున గుర్తుతెలియన వ్యక్తులు చోరీకి యత్నించారు. షట్టర్ తాళాలు, వెనుక వైపున ఉన్న తలుపులను పగులగొట్టారు. ఇదే సమయంలో జనం రాకను గమనించిన దుండగులు అక్కడి నుంచి పరార్ అయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జాగిలాలను రప్పించి తనిఖీలు చేయించారు. సెంటర్ మేనేజర్ ప్రమోద్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకట్రాజం తెలిపారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం


నర్సింలు(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన గెరిగంటి నర్సింలు(40) పది రోజుల క్రితం బహ్రెయిన్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. బుధవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పాతికేళ్లుగా నర్సింలు బహ్రెయిన్ వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాధ, ముగ్గురు కుమార్తెలు నవిత, అక్షయ, సాత్విక ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మోసపోయి.. అప్పులపై దిగులు చెంది

- దుబాయిలో వెంకట్రావుపేటవాసి ఆత్మహత్య


సాయిలు (ఫైల్)

కథలాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి పని విషయంలో మోసపోయాడు.. తీర్చాల్సిన అప్పులపై దిగులు చెంది, అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పస్తం సాయిలు(34)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అతను స్థానికంగా కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రూ.8 లక్షల వరకు అప్పులు ఉండటంతో ఏడాది క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ పని విషయంలో మోసం జరగడంతో అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందాడు. మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై, బుధవారం సాయంత్రం ఉరేసుకున్నాడు. తోటి కార్మికుల ద్వారా ఫోన్‌లో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయిలు దుబాయి తోపాటు గ్రామంలో చేసిన అప్పులు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. అతని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు గల్ఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


మృతిచెందిన సందీప్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల–రగుడు బైపాస్ రోడ్డుపై బుధవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన బండి సందీప్(26) వరుసకు సోదరుడైన బండి బాబు కలిసి బుధవారం కోనరావుపేట మండలం సుద్దాలకు వెళ్లారు. తిరిగి సొంతూరికి వస్తుండగా రగుడు వద్ద అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డుపై బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో సందీప్ తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బాబుకు తీవ్రగాయాలవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య లాస్య, మూడేళ్ల కూతురు ఉన్నారు.

అదుపుతప్పి రెండు వాహనాలు ఢీ


ప్రమాదానికి గురైన డీసీఎం, కారు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని ప్రధాన రహదారిపై రామాలయం సమీపంలో బుధవారం రెండు వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాయి. ముందుగా వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి నిలిచిపోయింది. వెనుకే వస్తున్న కారు డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కారులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.


విద్యుదాఘాతంతో యువకుడి మృతి


కల్యాణ్ (ఫైల్)

రాయికల్: మండలంలోని కుర్మపెల్లి గ్రామానికి చెందిన ఆది కల్యాణ్(23) విద్యుదాఘాతంతో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. అతను బుధవారం పొలంలో ఉన్న మోటార్‌కు మరమ్మతు చేయించి, బిగించాడన్నారు. అనంతరం పొలానికి నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతిచెందాడని చెప్పారు.

ఉత్తమ సామాజిక సేవ కార్యకర్త అవార్డుకు ఎంపికైన వెంకట్‌రెడ్డి

- అభినందనలు తెలిపిన మంత్రి కేటీఆర్
- ఈనెల 31న ఢిల్లీలో అందజేత


వెంకట్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెక్టార్ సంస్థ జాతీయస్థాయి ఉత్తమ సామాజిక సేవ కార్యకర్త అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలో ఈనెల 31న అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలువగా.. ఆయన అభినందించారు. ‘భారత్ కే అన్‌మోల్’ అవార్డుకు ఎంపికైన సర్పంచ్ వెంకట్‌రెడ్డిని ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, పంచాయతీ కో–ఆప్షన్ సభ్యుడు హైమద్, ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, పాలకవర్గం సభ్యులు అభినందించారు.

కొత్త బిచ్చగాళ్లకు చోటు ఇవ్వొద్దు


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొత్త బిచ్చగాళ్లకు చోటు ఇవ్వవద్దని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసే వారిని నమ్మొద్దని జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు కోరారు. మండలంలోని నారాయణపూర్, రాగట్లపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సభ్యులను ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. వంద మంది ఓటర్లకు ఒక కార్యకర్త పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి వివరించాలన్నారు. సర్పంచ్ స్వరూపమహేందర్, ఎంపీటీసీ ఉప్పుల మల్లేశం, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపెల్లి నర్సింహారెడ్డి, సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, మీసం రాజం, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సిరిసిల్ల నేతన్నలు ఆకలిచావులకు గురైన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఆ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గడ్డం మల్లేశం, అంజయ్య, మల్లయ్య, జగన్ తదితరులున్నారు.

వేములవాడలో కుక్కల బీభత్సం

25 మందికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు



కుక్కల దాడిలో గాయపడిన స్థానికులు

వేములవాడ: వేములవాడలో బుధవారం కుక్కలు రెచ్చిపోయాయి. వివిధ అవసరాల కోసం బయటకు వచ్చిన 25 మందిపై దాడి చేశాయి. గాంధీనగర్, జాతరాగ్రౌండ్, ఉప్పుగడ్డ, ముదిరాజ్‌వీధి ప్రాంతాల్లో దాదాపు 25 మందిని కరిచాయి. వీరంతా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. అందిరికీ యాంటీ రెబీస్ ఇంజక్షన్లు ఇచ్చి పంపించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. కుక్కల దాడులపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

వానలోనూ తప్పనిసరి !




సిరిసిల్లలో కురుస్తున్న వర్షం


సిరిసిల్లలో బురదమయమైన గ్రౌండ్


వానలోనూ విధుల్లో పారిశుధ్య కార్మికులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షం సిరిసిల్లను తడిపేసింది. ఎడతెరిపి లేకుండా ముసురుకున్న వానతో జనజీవనం స్తంభించింది. చిత్తడిగా మారిన రహదారులపై వెళ్లేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. డ్రెయినేజీల్లో పూడిక తీస్తూ మున్సిపల్ సిబ్బంది వరద ప్రమాదాన్ని నివారించే పనిలో ఉన్నారు. బడికెళ్లే పిల్లలు, రోజువారీ అవసరాలకు వచ్చే సాధారణ జనం వర్షాన్ని సైతం లెక్క చేయడం లేదు. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల